
# పేరున్న రచయిత

- కోలపల్లి ఈశ్వర్



**ఉదయం తొమ్మిదీ పదిహేనుకి షాపు తాళాలు తీసి లోపలికి వచ్చాను. వర్కర్స్ ఒక్కొక్కరే లోనికి వచ్చి తమ సరంజామా సర్దుకొంటుండగా పనిమనిషి వచ్చి షాపు ఊడ్చే పనిలో పడింది. కొద్ది నిముషాల్లోనే అందరూ తమతమ పనుల్లో లీనమయ్యారు.**

అప్పుడొచ్చాడు నేను ఆతృతగా ఎదురుచూస్తున్న మనిషి! పోస్టుమాన్ హరిప్రసాద్. ఆబగా అతని చేతిలోని ఉత్తరాలన్నీ లాక్కున్నట్టుగా తీసేసుకుంటుంటే అతను చిన్నగా నవ్వుకుంటున్న సంగతి నేను గమనించక పోలేదు. అందుకే అందులో ఒక కవరుకి పన్నెండు రూపాయల డ్యూ అని రాసి వుంటే... పదిహేను రూపాయలు అతని చేతిలో పెట్టి వెనుదిరిగాను.

సహజంగా ఏ రచయితకైనా పోస్టులో వచ్చే ఉత్తరాలు, చెక్కులు, మనీయార్డర్లంటే ఆసక్తి తప్పకుండా వుంటుంది. ఆరోజు వచ్చిన ఉత్తరాల్లో ఒకటి... ఒక వార పత్రికలో నా కథ 'మంచు కౌగిలి' సెలక్టయినట్టు వచ్చింది, మరొకటి... "తీయని విషం" అనే నవలకి సంబంధించిన చెక్కు. ఇవే కాకుండా మరో గులాబీ రంగు కవరొకటి.

ఆశ్చర్యపోతూ ఆ కవరునందుకున్నాను. అడ్రస్ రాసిన దస్తూరీ ఎవరిదో పోల్చుకోలేకపోయాను. గబగబా ఆ కవరు చించి లోపల వున్న కాగితాన్ని బయటకు తీసి అందులోని మేటర్‌ని చదవసాగాను.

"హలో!

నేను మీ అభిమానిని. ఎప్పటికప్పుడు మీ రచనలన్నీ విడవకుండా చదువుతుంటాను. చాలా ఇంట్రెస్టింగా వుంటున్నాయ్. ముఖ్యంగా లవ్, ఫ్యామిలీ స్టోరీస్... టేస్టీగా వుంటున్నాయ్. అవును... టేస్టీగానే! అందరూ రాసే సబ్జెక్ట్‌లే అయినా మీరు వాటికి రొమాన్స్ మసాలా అద్ది రాస్తున్నారుగా... అందుకే... వాటిని చదువుతుంటే... బెడ్ రూమ్‌లో వున్నట్టుగానే ఫీలవుతున్నా. చదివేప్పుడు మజాగానే వున్నా... చదవడమయ్యాక... టెన్షన్ ఆపుకోలేకపోతున్నాను... నిజం!

ఇంత టచింగ్‌గా రాసిన మీ టచ్‌ని అందుకోవాలని మనసు లోపలా... పైనా... ఒక్కటే తహతహ...

ఇది చదివాక కూడా ఆలస్యం చేస్తారా?! నోనో... అలా చేస్తే నా ఉసురు మీకు తగులుతుంది. వెంటనే నన్ను చేరుకోమని రాయాలనుంది. కానీ కొద్దిగా సస్పెన్స్ తప్పదు. మెల్లిమెల్లిగా ముడులు విప్పుతుంటేనా కదూ అసలైన థ్రిల్లు! సరే మరి... నేను మీ షాపుకి వస్తాను... అప్పుడు నన్ను పట్టేసుకోండి! ఎప్పుడో కాదు... ఈ వారంలోనే... ఇవాళో రేపో... ఎప్పుడో ఒక రోజున!!! వుంటామరి...

మీ

అభిమాని

విచిత్రంగా వుంది. ఇలాంటి ఉత్తరాలు గతంలో ఎప్పుడూ అందుకోలేదు. ఎవరో అమ్మాయి నన్నాటపట్టించాలని ఇలా రాసి వుంటుందా?! లేక నిజంగానే... నానుండి ఏదో ఆశించి... ఈ పని చేసిందా?!

నేను కాస్తో కూస్తో పేరున్న రచయితనే అని చెప్పగలను. ఇప్పటిదాకా పాతిక కథల దాకా రాసి వుంటాను. నాలుగు నవలలు కూడా అచ్చయ్యాయి. నా కథలు రెగ్యులర్‌గా చదివి అభిప్రాయాల్ని రాసే పాఠకులు ఓ పది మంది దాకా వున్నారు. అందులో ఆడవాళ్లెవరూ లేరు. అయితే ఈ వూళ్లో మా గార్మెంట్సు షాపు చాలా పాతదే కావడం వల్ల... కస్టమర్స్‌లో కొందరు ఆడవాళ్లు ఇక్కడకొచ్చినప్పుడల్లా నా లేటెస్ట్ రచనల గురించి కాస్సేపు ముచ్చటించి పోవడం కొత్తేం కాదు.

గులాబీ రంగు కవరు... ఇప్పుడు నా మెదడుకు తగినంత మేతనే కల్పించింది. ఇలాంటి ఉత్తరాలు నా రచనల్లోనూ అక్కడక్కడా ఉపయోగించాను. కానీ నిజ జీవితంలో... నేనే ఇలాంటిదాన్నొకటి అందుకోవాల్సి వస్తుందని మాత్రం ఎప్పుడూ ఎక్స్‌పెక్ట్ చేయలేదు.

నేను బ్రహ్మచారినే. కానీ నా వయసు ఏ పాతికో ముప్ఫయ్యో అనుకుంటే పొరపాటే. చూడ్డానికి ముప్ఫైరెండులా కనిపిస్తున్నా అక్షరాలా నాకు నలభై రెండేళ్లు.

ఇప్పుడిప్పుడే ఒక ఆలోచన వస్తోంది. మా షాపులో నలుగురు కుర్రాళ్లు పనిచేస్తున్నారు. వాళ్లతో నేను చాలా ఫ్రీగా వుంటాను. వాళ్లంతా ఇంకా పెళ్లెప్పుడు చేసుకుంటావన్నా అని అడుగుతూ వుంటారు నన్ను. కొంపదీసి వాళ్లలో ఎవడన్నా సరదాగా ఈ ఉత్తరం రాయలేదు కదా!

ఊహూఁ... అలా అనుకోవడం తప్పు. వాళ్లకంత సీన్ లేదు. నేనసలే కొన్ని విషయాల్లో స్ట్రిక్టు. ఇలాంటి తిక్కవేషాలు వేస్తే పనిలోంచి వూడబెరికి అవతలకి తరిమేస్తానని వారికి తెలుసు. పోనీ... మా ఇంట్లో వాళ్లెవరైనా... కోపంతో, కసితో నా తిక్క కుదర్చాలని ఈ పని చేశారా అనుకుందామంటే... అంత తీరికా, హాస్య చతురత వున్న వాళ్లెవరూ మా ఇంట్లో లేరు.

మా షాపుకొచ్చేవాళ్లలో తొంభై శాతం లేడీసే వుంటారు. అందులో వయసులో వున్న ఆడపిల్లలు కూడా ఎక్కువే. కానీ అమ్మాయిలతో కబుర్లాడడానికీ, వాళ్ల అందచందాలు పట్టించుకోడానికీ నాకు తీరికెక్కడిది! చుట్టూ పని వాళ్లు, ఎప్పుడూ వచ్చీపోయే కస్టమర్స్, బిజినెస్ కాపాడుకోవాలన్నది నా ప్రిన్సిపుల్... వీటి మధ్య ఎవరో నా పట్ల ఆకర్షణ పెంచుకునేంత అవకాశమే నేనివ్వలేను. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే... అమ్మాయిల్ని ఆకట్టుకునేంత అందం కూడా నాలో లేదు.

అయితే ఇదెలా జరిగింది?!

నిప్పు లేకుండా కూడా పొగ వచ్చే అవకాశముండొచ్చు గానీ, నిప్పు లాంటి వాడిని... నాకిలాంటి ఉత్తరం రావడమేమిటి!

"జాకెట్స్ రెడీ అయ్యాయా?" అనే ప్రశ్న విని ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. ఎదురుగా ఓ పదహారేళ్ల అమ్మాయి. అందంగా వుంది...

అందంగా వుందా?... ఈ ఆలోచనేమిటి! నేనెప్పుడూ కస్టమర్ల అంద చందాల గురించి పట్టించుకోనే? ఓహో... గులాబీ లెటర్ ప్రభావమప్పుడే మొదలైందన్న మాట!

"నేనిచ్చిన రశీదు ఇవ్వండి" అని అడుగుతూ కుట్టబడిన జాకెట్లుంచిన షోకేసు వైపు కదిలాను. ఆమె అందించిన చీటిలోవున్న నెంబరు, రంగుల ప్రకారం... ఆమె జాకెట్లు తీసి ప్యాక్ చేసి ఆమెకందించాను. ఆమె ప్యాకెట్ తీసుకొని వెళ్లిపోకుండా అక్కడే నిలబడి నన్నే చూడసాగింది.

షాక్ తిన్నాను. కొంపదీసి ఈవిడేనా ఆవిడ...?! ఆమె మొహంలోకే పరీక్షగా చూడసాగాను. కొద్దిగా నవ్వింది ఆమె.



ఇంటి వైద్యం

★ అరిమేదాది తైలము 10-20 మి.లీ. నోటిలోని తీసుకొని 5-10 నిముషాలు పుక్కిట పట్టి ఊస్తే చిగుళ్ళ వాపు తగ్గుతుంది.

ఈవిడేనేమో... ఈవిడే అయితే... నేనిప్పుడేం చేయాలి? అసలేం చేయాలని నా ఉద్దేశ్యం? ఆ లెటర్‌కి ఎలా రియాక్టవ్వాలి? అరెరె... ఆ సంగతే ఇంకా ఆలోచించుకోలేదే! ఏమో... ఏదో ఒకటి చేసేయాలి?

గొంతు సవరించుకుని... "మీ... మీ అడ్రెస్?" అని అడిగాను. అడిగాక అనిపించింది... పేరేమిటో అడక్కుండా అడ్రెసెందుకడిగానా అని. అంతలోనే స్ట్రైకయ్యింది... ఆవిడ పేరు రశీదు పుస్తకంలో డూప్లికేట్ కూపన్‌పై వుంటుంది కదా అనే విషయం.

"అదేంటి? నా అడ్రస్‌తో ఇప్పుడేమవసరం?" అందావిడ సీరియస్‌గా చూస్తూ.

నాలిక్కరుచుకున్నాను. ఛీ ఛీ... ఇదేంటిలా పిచ్చిగా ప్రవర్తిస్తున్నాను?

"అహ... మరేమీ లేదు. త్వరలో మేము కొన్ని కస్టమర్ బెనిఫిట్ స్కీములు ప్రవేశపెట్టబోతున్నాము. వాటి వివరాలు ప్రింటింగ్‌కిచ్చి వున్నాము. అవి రాగానే పోస్ట్‌లో మీకు పంపించడానికి వీలు కలుగుతుందని" అప్పటికప్పుడు బుర్రలో ఫ్లాష్‌గా వెలిగిన ఉపాయంతో నా తొందరపాటుని కవర్ చేసేశాను.

"అలాగా... మంచిదేగా..." అంటూ పర్స్‌లోంచి ఒక విజిటింగ్ కార్డు బయటకి తీసిస్తూ" ఇది మా ఫాదర్ పనిచేసే ఆఫీస్ అడ్రస్" అంది.

కార్డుని తీసుకుని యధాలాపంగా ఆ అడ్రస్‌కేసి చూసి గతుక్కుమన్నాను. "ఆఫీస్ ఆఫ్ ది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్" అనేది ముందుగా నా కళ్లకి కనిపించింది. పైన ఆవిడ తండ్రి పేరు, ఆయన డిసిగ్నేషన్ వున్నా... అవి చదవలేకపోయాను... అప్పటికే నా కళ్ల ముందు చీకటి కమ్ముకున్నట్టయిపోవడంతో.

వెంటనే కార్డు తీసి సొరుగు లోపల పెట్టేస్తూ... "మీరు దేనికోసమో నిల్చున్నట్టున్నారు???" అన్నాను.

"అది జాకెట్టివ్వడం మర్చిపోయారు మీరు"అందా అమ్మాయి చిన్నగా నవ్వుతూ.

గబగబా ఆది జాకెట్టు వెదికి ఆ ప్యాకెట్‌లో పెట్టేస్తూ... "సారీ" అన్నాను.

"ఇట్స్ ఓకే" అని చెప్పి వెళ్లిపోయిందామె.

గట్టిగా వూపిరి పీల్చుకున్నాను. గండం గడిచినట్లైంది. అమ్మో... లేకపోతే ఎంత ప్రమాదంలో పడిపోయేవాణ్ణి.

సీట్లో కూర్చుని రిలాక్సవుతూనే ఒక వర్కర్‌ని పిలిచి స్ట్రాంగ్ టీ ఒకటి తెమ్మని పురమాయించాను.

టీ తాగుతూ మళ్లీ లెటర్ గురించి ఆలోచించసాగాను.

ఏమిటో... ఇదేదో ప్రమాదకరమైన ఇష్యూలాగుంది. ఎందుకొచ్చిన తంటా! నిజంగానే ఎవరో అమ్మాయి... నిజంగానే ఏదో మనసులో పెట్టుకుని రాసినా... చేయాల్సిందేముంది గనక! ఇంతవరకూ నా జీవితంలో అమ్మాయిల మోజులో పడిందే లేదు. ఇంటాబయటా నేను మిస్టర్ క్లీన్‌నే. కోరికోరి నా పర్సనల్ రిపోర్ట్‌పై రెడ్ మార్క్ పడనివ్వడం నాకు సుతరామూ ఇష్టం లేదు.

అయినా ఒక పేరున్న రచయితనై వుండి... ఇలాంటి ప్రలోభంలో పడడమేంటి!



**ఏమిటో... ఇదేదో ప్రమాదకరమైన ఇష్యూలాగుంది. ఎందుకొచ్చిన తంటా! నిజంగానే ఎవరో అమ్మాయి... నిజంగానే ఏదో మనసులో పెట్టుకుని రాసినా... చేయాల్సిందేముంది గనక! ఇంతవరకూ నా జీవితంలో అమ్మాయిల మోజులో పడిందే లేదు. ఇంటాబయటా నేను మిస్టర్ క్లీన్‌నే. కోరికోరి నా పర్సనల్ రిపోర్ట్‌పై రెడ్‌మార్క్ పడనివ్వడం నాకు సుతరామూ ఇష్టం లేదు.**

ఈ ఆలోచన రావడంతోనే నా మనసు చుట్టూ ఆవరించిన ఆందోళనా మేఘాలు దూదిపింజల్లా ఎగిరిపోయాయి.

మరునాడు మామూలుగానే గడచిపోయింది. ఆ మరునాడు షాపు తెరచి, పోస్టులో వచ్చిన ఉత్తరాలన్నీ చదువుకున్నాక, తీరిగ్గా టీ తాగుతూ కూర్చున్నాను.

పక్కనున్న టెలిఫోన్ మ్రోగడంతో రిసీవర్ ఎత్తి 'హలో' అన్నాను.

"హలో..." కొంచెం గాభరాగా పలికింది అవతలి నుంచి... ఓ ఆడ కంఠం.

"యస్... చెప్పండి..." అన్నాను.

"సారీ సార్... నేను... మొన్న మీకొక ఉత్తరం రాశాను. అదే... గులాబీ రంగు కవర్లో... అదీ... మీ అభిమాని రాసినట్టుగా..." ఆగిందామె.

నా గుండె వేగం పెరిగింది... ఇప్పటికి టెన్షన్ తొలగిపోనుందన్న సంతోషంలో.

"ఆ ఆ... ఎవరు మీరు?" అడిగాను.

"అదీ... నేనెవరో చెప్పలేనండి. కానీ ప్లీజ్... నేను చెప్పేది వినండి. అసలు జరిగిందేమిటంటే..."

ఆవిడ చెప్పుకుపోతోంది...

ఆవిడ మా కాలనీలో ఒక ఫ్రెండ్ ఇంటికి వచ్చినపుడు ఒక అందమైన హీరోలాంటి యువకుడిని చూసిందట. వెంటనే అతని పట్ల ప్రేమను పెంచుకుందట. అతనెవరో కాదు నా తమ్ముడే. దూరంనుంచి మా ఇల్లును చూపించి... "అదిగో ఆ ఇంట్లో రెడ్ టీషర్ట్ వేసుకొన్నాయన ఎవరు?" అని ఎవరో ఒక అమ్మాయిని అడిగితే నా పేరు, మా షాపు అడ్రసు డీటైల్‌గా చెప్పిందట. వెంటనే ఏవేవో ఊహించుకుని కాగితమూ కలమూ తీసుకుని నాకు ఆ లెటర్ రాసి పోస్టు డబ్బాలో వేసిందట.

నిజానికి ఆ సమయంలో నేను నా తమ్ముడి టీషర్ట్ వేసుకోవడమే ఈ రసాభాసకి కారణం.

కానీ తరువాత అసలు విషయం తెలుసుకున్న ఆ ప్రేమికురాలు... భయంతో కంపించిపోయి ఇలా ఫోన్ చేసి సారీ చెబుతోందన్న మాట.

"హలో... హలో... అదండీ సంగతి. నన్ను క్షమించి, ఆ లెటర్ చించి పారేయండి... ప్లీజ్. లేకపోతే ఏం జరుగుతుందోనని భయంగా వుందండీ" ఏడుస్తోందా అమ్మాయి.

నాక్కొంచెం కోపంగానే వున్నా, ఆ అమ్మాయి అలా దుఃఖిస్తుంటే చెప్పలేని జాలి కలిగింది.

"అలాగే నీ లెటర్ చించేస్తాను గానీ... నేను చెప్పేది కాస్త వింటావా?" అన్నాక ఆవిడ మౌనంగా వుండిపోయింది.


"కాలం ఇంత మారిపోయాక కూడా నీలాంటి అమ్మాయిలు ఇంకా వున్నారంటే ఆశ్చర్యంగానూ, బాధగానూ వుంది. జీవితం సినిమా అనుకున్నావా? మనిషిని చూడగానే మోజుపడి, అదే ప్రేమ అనుకుని... పిచ్చి పిచ్చిగా ఉత్తరాలు రాసి థ్రిల్ చేయాలనుకోవడమూ, ఫోన్‌లో ఏదేదో మాట్లాడి అర్థంపర్థంలేని నిర్ణయాలు తీసుకోవడమూ... ఏమిటీ వెర్రి?! అవకతవక సినిమాలు చూసి వాటి ఇన్‌ఫ్లూయెన్స్‌లో దారి తప్పి, జీవితాన్ని బుగ్గి చేసుకోవడం వివేకం కాదు. ఇప్పటికైనా అర్థం అయిందిగా. ఇకనుండి ఇలాంటి తిక్క వేషాలెయ్యకు."


"సరేనండి. థాంక్సండీ... ఆ లెటర్..."

"ఇదిగో చించేశాను" అంటూ లెటర్ తీసి ముక్కలు ముక్కలు చేశాను. ఆవిడ ఫోన్ పెట్టేసింది. హితోపదేశం బాగానే చేశాను గానీ... ఇక నుంచి నేను కూడా సమాజాన్ని పక్కదోవ పట్టించే రచనలు చేయడం మానేయాలి.

★

**రచయిత చిరునామా:**
**కోలపల్లి ఈశ్వర్,**
స్టోన్‌హౌస్ పేట, నెల్లూరు- 524 002.




ఇంటి వైద్యం

★ దంత వేష్టహరి చూర్ణాన్ని చిగుళ్ళవాపుపై రాసి మర్దనచేస్తే చిగుళ్ళ వాపు తగ్గుతుంది.